క్లుప్తంగా

'సులభ్' కార్మికుల వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

మందమర్రిరూరల్: ఏరియాలోని సులభ్ కాంప్లెక్స్‌ల్లో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులకు గత నెల రావాల్సిన వేతనాలు, ఇంత వరకు చెల్లించలేదు. యాజమాన్యం జోక్యం చేసుకొని ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం ఏరియా జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు జాఫర్, ఐఎఫ్‌టీయూ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు, కార్మికులు సురేందర్, అజయ్, మల్లేశ్, వెంకటి తదితరులు ఉన్నారు.

ధాన్యం త్వరగా తరలించాలి

జైపూర్: భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని కొనుగోలు కేంద్రాల్లో నిల్వచేసిన ధాన్యం ఆలస్యం చేయకుండా నిర్వాహకులు పెద్దపల్లి జిల్లాకు రవాణా చేయాలని డీఆర్‌డీవో కిషన్ సూచించారు. మండలంలో గల షెట్‌పల్లి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి నిర్వాహకులు పలు సూచనలు చేశారు. పెద్దపల్లి జిల్లాలో ఎలాంటి జాప్యం కాకుండా లారీలు త్వరగా అన్‌లోడ్ అవుతున్నాయని కావున అక్కడికి తరలించాలని సూచించారు. ఆయనతో ఎంపీఎం రాజ్‌కుమార్, సీసీ దీపక్ ఉన్నారు.

'అవకతవకలపై ఎమ్మెల్యే స్పందించాలి'

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్ షటర్ల కేటాయింపుల్లో జరిగిన అక్రమాలపై ఎమ్మెల్యే వినోద్ వెంటనే స్పందించాలని బెల్లంపల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్ డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కెట్లో కొత్తగా షటర్ల కేటాయింపులు జరిగాయని తెలిపారు. వీటిలో కూరగాయలు అమ్ముకునే వ్యాపారులకు బదులు, కొందరు మాజీ ప్రజా ప్రతినిధుల కుటుంబ సభ్యులకు కేటాయించడం సరైంది కాదన్నారు. ఈ తీరును బీఆర్‌ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని పేర్కొనారు. అనర్హులకు షటర్లను అప్పగించి అర్హుల నోట్లో మట్టి కొడుతున్నారని విమర్శించారు. జరిగిన అక్రమాలపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ శ్రేణులు బడికల శ్రావణ్, మద్దెల గోపి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయండి

లక్సెట్టిపేట: జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో పిలుపునిచ్చారు. పెట్టుబడి దారుల కోసం కార్మికవర్గాన్ని బలించే లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కనికారం అశోక్, రంజిత్, ఎల్లయ్య, సునీత, పోసవ్వ, రాణి, కవిత, పద్మ, హైమావతి పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్టె ఎరువులు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పచ్చిరొట్టె ఎరువులు, జనుముల విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్ బుధవారం ఒక ప్రటనలో తెలిపారు. అవసరమున్న రైతులు పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌లతో కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

'మద్యం తాగి వాహనాలు నడుపొద్దు'



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

రామకృష్ణాపూర్: మద్యం తాగి వాహనాలు నడుపొద్దని పట్టణ ఎస్సై రాజశేఖర్ సూచించారు. మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. రాంగ్‌రూట్‌లో వాహనాలు నడపటం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయటం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ నియమ నిబంధనలు పాటించాలన్నారు. అనంతరం గ్రామ రోడ్డు భద్రత కమిటీ అధ్యక్షుడిగా కిషన్‌ను ఎన్నుకున్నారు. ఏఎస్సై వెంకయ్య, హెడ్‌కానిస్టేబుల్ సత్తయ్య, సురేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుకాసురులు..!



దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్ గోదావరి నదీ తీరంలో ఇసుక దోపిడీ యథేచ్ఛగా సాగుతోంది. అడ్డుకట్ట వేయాల్సిన అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో, అక్రమదందాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. అభివృద్ధి పనుల పేరుతో ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయమై డీటీ విజయను ఫోన్‌లో సంప్రదించగా.. ఇసుక తరలింపునకు ఎవరికి, ఎలాంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

బెంబేలెత్తిస్తున్న మర్కటాలు



దండేపల్లి: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో మర్కటాలు(కోతులు) బెడద రోజురోజుకు పెరిగిపోతుంది. అడవుల్లో ఉండాల్సిన కోతులు జనం మధ్యలో గుంపులు, గుంపులుగా తిరుగుతుండడంతో, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. రోడ్ల వెంట, ఇళ్లపై తిరుగుతున్నాయి. ఇళ్ల పెంకులు పీకేస్తున్నాయి. కోతులను పట్టించి అడవుల్లో వదిలిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

20రోజులుగా అంధకారం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం పెద్దంపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో వీధి దీపాలు వెలగక 20రోజులుగా అంధకారంలో ఉంటోంది. పాలకవర్గం లేకపోవడంతో కనీసం వీధిదీపాల గురించి పట్టించుకునే నాథుడు లేక చీకట్లో ఉంటున్నామని స్థానికులు వాపోతున్నారు. చీకటి పడిందంటే బయటకు రావాలంటే భయంగా ఉందని, ఇకనైనా వీధిదీపాలు వెలిగేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



కళాశాల ఏర్పాటు కలేనా..!

- భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఇంటర్ కాలేజీ లేక ఇక్కట్లు
- ఉన్నత విద్యకు దూరమవుతున్న పేద, మధ్యతరగతి విద్యార్థులు
- అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు
- ఏర్పాటు చేయాలని విద్యార్థుల వేడుకోలు



కళాశాల ఏర్పాటు కోసం భీమిని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు



నా పేరు కొండ గొర్ల నందిని. మాది కన్నెపల్లి మండలంలోని పోలంపల్లి గ్రామం. భీమిని కేజీబీవీలో పదో తరగతి చదివి మండల టాపర్‌గా నిలిచాను. తల్లిదండ్రులు లేకున్నా తాతయ్య, నానమ్మ, కుటుంబసభ్యుల ప్రోత్సాహంతో చదివాను. ఇంటర్‌లో ఎంపీసీ చదివి, ఇంజనీర్ కావాలని ఉంది. కేజీబీవీలో ఇంటర్ విద్య ప్రవేశపెడితే నాలాంటి వారికి ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

భీమిని: బెల్లంపల్లి నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉండగా, ఇటీవల నెన్నెల, వేమనపల్లి, తాండూరు మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. భీమిని మండలంలో వీగాం, వెంకటపూర్, భీమినిల్లో ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ పాఠశాల ఉన్నాయి. కన్నెపల్లి మండలంలో జన్కాపూర్, బోగుడగూడెం, కన్నెపల్లిలో ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీ, సాలీగాంలో మేరీమాత ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ప్రతీ సంవత్సరం సుమారు మూడు వందల మంది విద్యార్థులు పదో తరగతి పూర్తి చేస్తుండగా, చదవాలనే కోరిక ఉన్నా కళాశాలలు అందుబాటులో లేకపోవడంతో, పట్టణాలకు వెళ్లలేక భీమిని, కన్నెపల్లి మండలాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ విద్యకు దూరం అవుతున్నారు. కళాశాలలు ఏర్పాటు చేస్తామని ఏళ్లుగా ప్రజాప్రతినిధులు హామీలు ఇస్తున్నా, అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకొని భీమిని, కన్నెపల్లి మండలాలకు కళాశాలలు మంజూరు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేజీబీవీల్లో ఒకటే గ్రూపు...

భీమిని, కన్నెపల్లి కేజీబీవీ బాలికల పాఠశాలల్లో ఇంటర్ విద్య బోధించాలని ప్రతిపాదనలు వచ్చినప్పటికీ, గదుల కొరత, మౌలిక వసతుల లేమితో అమలు కావడం లేదు. కన్నెపల్లి కేజీబీవీలో బైపీసీ గ్రూపునకు మాత్రమే అడ్మిషన్లు తీసుకుంటున్నారు. ఎంపీసీ, సీఈసీ, ఇతర కోర్సులు చదవాలనే ఆసక్తి ఉన్న విద్యార్థులకు కలగానే మిగులుతుంది. కేజీబీవీల్లో వసతులు కల్పించి, ఇంటర్‌లో అన్ని గ్రూపులు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

పట్టణానికి వెళ్లలేను..



మా డాడీ పదో తరగతి పరీక్షల ప్రారంభం రోజున చనిపోయారు. మా ఊరి వాళ్లు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఉత్తీర్ణత సాధించాను. ఉన్నత విద్యకోసం పట్టణానికి వెళ్లలేను. కన్నెపల్లిలో కళాశాల ఏర్పాటు చేయాలి.

- మంచర శ్రీలత, ముత్తపూర్, కన్నెపల్లి

కళాశాల ఏర్పాటు చేయాలి



భీమిని మండల కేంద్రంలో కళాశాల లేకపోవడంతో పదో తరగతితోనే ఆగాల్సి వస్తుంది. మా దగ్గరి నుంచి బెల్లంపల్లి పట్టణానికి వెళ్లడానికి బస్ సౌకర్యం కూడా లేదు. అధికారులు స్పందించి మా మండలంలో కాలేజీ ఏర్పాటు చేసేలా చూడాలి.

- దాసరి అంజన్న, వెంకటపూర్, భీమిని

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

ఇప్పటికే జిల్లాలో జూనియర్ కళాశాలలు లేని మండలాల వివరాలు ప్రభుత్వానికి పంపించాం. పలు మండలాలకు జూనియర్ కళాశాలలు మంజూరయ్యాయి. మిగిలిన మండలాల్లో ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే ఏర్పాటు చేస్తాం.

- అంజయ్య, డీఐఈవో, మంచిర్యాల

తేలని ఇందిరమ్మ లెక్క

- సొంతింటి కోసం దరఖాస్తుదారుల ఎదురుచూపులు
- వెరిఫికేషన్ పేరుతో కాలయాపన



నమూన ఇందిరమ్మ ఇల్లు

దండేపల్లి: పేదోడి సొంతింటి కల నెరవేర్చాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రవేశపెట్టింది. పథకానికి సంబంధించి లబ్ధిదారుల లెక్క ఇంకా ఎటూ తేలకపోవడంతో, ఇళ్లు ఎవరికి వస్తాయో.. ఎప్పుడు ఇస్తారో.. అని ఎదురుచూస్తున్నారు. సర్వేలు, వెరిఫికేషన్‌ల పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్పా, ఇంకా ఇళ్లు మంజూరు చేయకపోవడంతో సొంతిళ్లు నిర్మించుకోవాలనుకుంటున్న పేదలకు ఎదురుచూపులు తప్పడం లేదు.

మండలంలో ఇదీ పరిస్థితి..

దండేపల్లి మండలంలో 31గ్రామ పంచాయతీలు ఉండగా, అందులో వందుర్‌గూడ మినహా 30గ్రామ పంచాయతీల్లో ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం 13,502మంది దరఖాస్తులు చేసుకున్నారు. వాటిని ఎల్–1, ఎల్–2, ఎల్–3గా విభజించారు. అందులో ఎల్–1 (ఇళ్లు లేకుండా ఇంటి స్థలం ఉన్నవారు)6,682మందిని, ఎల్–2(ఇళ్లు లేదు ఇంటి స్థలం లేనివారు) 1,104మందిని ఎంపిక చేయగా, వివిధ కారణాలతో 5,716మందిని రిజెక్ట్ చేశారు. అయితే ఇందులో పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని ధర్మరావుపేటను ఎంపిక చేసి 101ఇళ్లు మంజూరు చేశారు. ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

29గ్రామాల్లో ఎదురుచూపులు..

మండలంలోని 30గ్రామాల ప్రజలు ప్రజాపాలన ద్వారా ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. మంచిర్యాల నియోజకవర్గానికి మొదటి విడతలో 3500ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో దండేపల్లి మండలానికి సుమారుగా 600పై చిలుకు ఇళ్లు వచ్చే అవకాశం ఉంది. ఇందులో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ధర్మరావుపేటకు 101ఇళ్లు పోగా మిగిలిన సుమారు 500ఇళ్లను 29జీపీలకు కేటాయించాల్సి వస్తుంది. వీటికి సంబంధించి ఇందిరమ్మ కమిటీల సభ్యులు ఇచ్చిన జాబితా ప్రకారం, మండల అధికారులు వెరిఫికేషన్ పూర్తిచేసి మండల పరిషత్ కార్యాలయాల్లో నివేదికలు అందించారు. ఎమ్మెల్యే, కలెక్టర్, మంత్రి ఆమోదం పొందిన తర్వాత లబ్ధిదారుల జాబితా బయటకు రానుంది. అప్పటిదాకా ఎదురుచూపులు తప్పేలా లేవు.

వెరిఫికేషన్ పూర్తి..

దండేపల్లి మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ పూర్తయ్యింది. పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేయబడిన ధర్మరావుపేటలో ఇళ్ల నిర్మాణం సాగుతోంది. మండలంలోని మిగితా గ్రామ పంచాయతీల్లో ఇందిరమ్మ కమిటీలు ఇచ్చిన జాబితా ప్రకారం వెరిఫికేషన్ పూర్తయ్యింది. అందుకు సంబంధించిన నివేదిక జిల్లాకు పంపించాం.

- ప్రసాద్, ఎంపీడీవో, దండేపల్లి

కబ్జా అయిన భూమిని తిరిగివ్వాలని స్వాములకు భిక్ష

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని గర్మిళ్ల శివారు ఓ వెంచర్‌లోని భక్తాంజనేయ స్వామి హనుమాన్ దేవాలయంలో బుధవారం దీక్షాపరులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. 290సర్వేలోని వెంచర్‌లో భూములు కొనుగోలు చేయగా, కబ్జాకు గురయ్యాయి. కబ్జా నుంచి తమ భూములను రక్షించాలని కోరుతూ స్వాములకు భిక్ష ఏర్పాటు చేసినట్లు తెలిపారు.



భూములు అప్పగించాలని కోరుతున్న దీక్షాపరులు

భూసమస్యల పరిష్కారం దిశగా చర్యలు

- కలెక్టర్ కుమార్ దీపక్

భీమారం: భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కుమార్‌దీపక్ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి భూ భారతి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. నూతన చట్టంలో రికార్డుల్లో తప్పుల సవరణకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేందుకు ముందు భూముల వివరాలు పూర్తి స్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయనున్నట్లు తెలిపారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులు పరిష్కరిస్తామన్నారు. తహసీల్దార్ సదానందం, ప్రత్యేక అధికారి వనజారెడ్డి పాల్గొన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ మేరకు పనులు మరింత వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఆసుపత్రి ద్వారా స్థానిక ప్రజలకు వైద్యసేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు.

ఆసుపత్రి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

చెన్నూర్: ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తుందని, భవన నిర్మాణం పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. చెన్నూర్‌లో రూ.20కోట్ల నిధులతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవన పనులను బుధవారం పరిశీలించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందుతాయన్నారు. పనులను సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ల సమన్వయంతో పనులు సకాలంలో పూర్తయ్యేల కృషి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మల్లికార్జున్, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



దరఖాస్తులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

ధాన్యం తరలింపు వేగంగా జరగాలి

కోటపల్లి/చెన్నూర్‌రూరల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తరలింపు వేగంగా నిర్వహించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కోటపల్లి మండలంలోని సర్వాయిపేట, పార్‌పల్లి, లక్ష్మీపూర్, అన్నారం, చెన్నూర్ మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. తెలంగాణలో వర్ష సూచనలు ఉన్నందునా కేంద్రాల్లో ధాన్యం వేగంగా తూకం వేసి, మిల్లులకు తరలించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ధాన్యం తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కోటపల్లి మండల ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించి, ఆరోగ్యకేంద్రంలో ల్యాబ్‌లు, మందుల నిల్వలు, రిజిస్టర్లు పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సందర్శించిన సమయంలో వైద్యురాలు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేసి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. దేవులవాడలో నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించి నాణ్యత పాటించి త్వరగా పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాఘవేంద్రరావు, ఏవో సాయికృష్ణ, డీటీ నవీన్‌కుమార్, ఆర్‌ఐ శ్రీనివాస్, ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

పంట నష్టం పరిశీలన

నెన్నెల: మండలంలోని గొల్లపల్లిలో వర్షానికి జరిగిన పంట నష్టాన్ని బుధవారం భీమిని ఏడీఏ సురేఖ పరిశీలించారు. పంట నష్టం వాటిల్లిన పొలాలను సందర్శించి ప్రాథమికంగా అంచనా వేశామన్నారు. ప్రభుత్వానికి నివేదిక అందజేసి పరిహారం అందేలా కృషి చేస్తామని ఆమె తెలిపారు.

రిటైర్మెంట్ స్కీమ్ బెనిఫిట్ అందజేత

బెల్లంపల్లి: పట్టణానికి చెందిన దొరిశెట్టి తిరుపతి పక్షవాతంతో మంచానికి పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ భారం కావడంతో తాపీ కార్మిక సంఘం తరఫున బుధవారం రూ.30వేలు నగదు రిటైర్మెంట్ స్కీమ్ కింద సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రాంకుమార్, శ్రీనివాస్ బాధితుడికి అందజేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ వర్ధంతి

బెల్లంపల్లి: దివంగత భారత మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు బుధవారం బెల్లంపల్లిలో ఘనంగా జరిగాయి. పట్టణ కాంగ్రెస్ కార్యాలయం ఆవరణంలో వర్ధంతిని నిర్వహించగా, ఎమ్మెల్యే గడ్డం వినోద్ ముఖ్య అతిథిగా హాజరై రాజీవ్‌గాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశానికి ఐటీ రంగాన్ని పరిచయం చేసిన ఘనత రాజీవ్‌గాంధీకి దక్కుతుందని పేర్కొన్నారు. దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో ముందుకు తీసుకెళ్లడానికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. దేశంకోసం రాజీవ్ గాంధీ అమరుడయ్యారని పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ చూపిన మార్గంలో కాంగ్రెస్ శ్రేణులు ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల మల్లయ్య, నాయకులు రొట్టె శారద, నాతరి స్వామి, పలువురు మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




బెల్లంపల్లి: శ్రద్ధాంజలి ఘటిస్తున్న ఎమ్మెల్యే వినోద్


చెన్నూర్/రామకృష్ణాపూర్/జన్నారం/లక్సెట్టిపేట: చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, జన్నారం మండల కేంద్రంలో, రామకృష్ణాపూర్ బీజోన్ రాజీవ్‌చౌక్‌లో, లక్సెట్టిపేట ఐబీ ఆవరణలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారత ప్రధానిగా రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో లక్సెట్టిపేటలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ ఆరీఫ్, చింత అశోక్, వెంకటస్వామి గౌడ్, శ్రీధర్, స్వామి, రవీందర్, ధర్మయ్య, శాంతికుమార్, జన్నారంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముజాఫర్ అలీఖాన్, పార్టీ నాయకులు రమేశ్, కరుణాకర్, భాస్కర్‌గౌడ్, సుధీర్‌కుమార్, నందునాయక్, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు సోహేల్ ఖాన్, అజ్మత్, రామకృష్ణాపూర్‌లో పార్టీ పట్టణ అధ్యక్షుడు పల్లెరాజు, వొడ్నాల శ్రీనివాస్, శ్యాంగౌడ్, మహంకాళి శ్రీనివాస్, కనకరాజు, గోపురాజం, చెన్నూర్‌లో హిమవంతరెడ్డి, రాజమల్లగౌడ్, చీర్ల సుధాకర్‌రెడ్డి, మహేశ్‌ప్రసాద్, పాతర్ల నాగరాజు, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.




రామకృష్ణాపూర్: నివాళులర్పిస్తున్న నాయకులు



జన్నారం: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో...



లక్సెట్టిపేట: పూలమాల వేస్తున్న నాయకులు

గల్ఫ్ కార్మికుడికి చేయూత

జన్నారం: కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న గల్ఫ్ కార్మికుడు దేవి ప్రభాకర్‌కు జన్నారం మండలం తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి రాంపూర్ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రూ.22,600 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు కల్లేడ భూమయ్య, గ్రామ అధ్యక్షుడు లింగాల వెంకటేష్, కార్యదర్శి గజ్జెలి ఇజ్రాయెల్, కల్లెడ లచ్చన్న, వేల్పుల రాజు, గ్రామ పెద్దలు లింగాల గంగయ్య పాల్గొన్నారు.

యూనిఫాంలు పంపిణీ

భీమారం: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో బుధవారం స్కూల్ యూనిఫాంలను ఎంఈవో వేణుగోపాల్, ఐకేపీ ఏపీఎం త్రియంబక్ కలిసి ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. సీఆర్పీ సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.